


# ఈకాలం

THE HONEST TELUGU DAILY




శుక్రవారం 23-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :84 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

### 'టీమ్ ఇండియా' అని పిలవొద్దంటూ పిటిషన్:

## సుప్రీంకోర్టు ఆగ్రహం



2లో

## ఇండిగోకు 'డిసెంబర్' దెబ్బ.. లాభంలో 78 శాతం క్షణత



2లో

## మూడు రోజుల నష్టాలకు బ్రేక్.. రాణించిన సూచీలు



# వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీతో సీఎం రేవంత్ భేటీ



దావోస్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జెరెమీ జర్గెన్స్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఏటా హైదరాబాద్‌లో ఔజుఖీ ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని కోరారు. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఎకనామిక్ ఫోరం బృందం ఆయనకు తెలిపింది. సీ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్‌తోనూ సీఎం భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యలను రేవంత్ వివరించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

# 'చిన్నారులకు సోషల్ మీడియా బ్యాన్'..

## స్టడీ చేస్తున్నాం: మంత్రి నారా లోకేశ్



- ఆస్ట్రేలియా తరహా నిర్ణయం: ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలపై ఉన్న సోషల్ మీడియా నిషేధాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయడంపై ప్రభుత్వం పరిశీలిస్తోంది.
- కంటెంట్ అవగాహన: చిన్న పిల్లలు సోషల్ మీడియాలో చూసే కంటెంట్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేరని, అందుకే ఒక వయస్సు పరిమితి అవసరమని లోకేశ్ అభిప్రాయపడ్డారు.
- చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్: దీని కోసం బలమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు.

దావోస్: ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై అక్కడి ప్రభుత్వం డిసెంబరు నుంచి నిషేధం విధించింది. ఇలాంటి సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బృందం దావోస్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. దావోస్‌లో బ్లూమ్‌బర్గ్‌తో లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. "ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్న యువకులు అలాంటి ప్లాట్‌ఫామ్‌లలో ఉండకూడదు. ఎందుకంటే వారు బహిర్గతం చేసే కంటెంట్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేరు. అందువల్ల, బలమైన, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరం కావచ్చు. ఆ దిశగా మేం ఆలోచిస్తున్నాం" అని లోకేశ్ వెల్లడించారు.

**సీఎం రేవంత్‌తో లోకేశ్ భేటీ**

దావోస్ పర్యటనలోనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. "రెండు రాష్ట్రాల్లోని విద్యా సంస్కరణలు, ఐటీ అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్మాణాత్మక చర్చలు జరిపాం. పరస్పర సహాయ సహకారాలతో దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత వేగంగా వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నా. వేర్వేరు రాష్ట్రాలుగా పెట్టుబడుల కోసం పోటీ పడినా.. కలిసి కట్టుగా దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం" అని లోకేశ్ తెలిపారు.

## తిరుమలలో 'రథసప్తమి'..

### 14 రకాల వంటకాలతో భక్తులకు అన్నప్రసాదాలు: బీఆర్ నాయుడు

తిరుమల: తిరుమల శ్రీవారి సన్నిధిలో ఈనెల 25న రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు.



2లో

## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దావోస్ పర్యటనపై దుష్ప్రచారం తగదు: రవినాయుడు




తిరుపతి: ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దావోస్ పర్యటనపై వైకాపా శ్రేణులు దుష్ప్రచారం చేయడం దారుణమని శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియం, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, బయోటెక్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, రాష్ట్రాభివృద్ధి చేయడమే చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. గుడివాడ అమర్నాథ్ ఐటీ మంత్రిగా రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ పరిశ్రమలను తీసుకొచ్చి అభివృద్ధికి బీజం వేశారని కొనియాడారు. వైఎస్ జగన్ పాలనలో హత్యా రాజకీయాలు, విధ్వంసాలు, అరెస్టులు, బెదిరింపులు, దోపిడీలకు మాత్రమే జరిగాయని విమర్శించారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం 5. 13 లక్షల ఉద్యోగాలు కల్పించిందని రవినాయుడు గుర్తు చేశారు.



## బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి అప్పులు భారీగా పెరిగాయి: కిషన్ రెడ్డి

భారత రాష్ట్ర సమితి హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్‌కో, ట్రాన్స్‌కో డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్? కుటుంబమే చూసేది. ఆ సంస్థ సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారు. సింగరేణి బోర్డు సమావేశం వివరాలు కూడా నా దృష్టికి రావు.

# మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా?: కేటీఆర్

సిరిసిల్ల: కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ అంటూ డ్రామాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "సీఎం బావమరిది బొగ్గు స్కామ్‌ను హరీశ్‌రావు బయటపెట్టారు. ఉదయం కుంభకోణం బయటపెడితే సాయంత్రానికి నోటీసులు వచ్చాయి. రేవంత్‌రెడ్డి సిట్ అంటే... సిట్, స్టాండ్. సిట్ విచారణ సీరియల్ లా మారింది. ఆర్ఆర్ ట్యాక్స్, బొగ్గు కుంభకోణంపై మాత్రం సిట్ ఉండదు. ఏదో రూపంలో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.



డ్రామాలు: కాళేశ్వరం స్కామ్, ఫోన్ ట్యాపింగ్ అనేవి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఆడుతున్న డ్రామాలు అని కేటీఆర్ విమర్శించారు.

బొగ్గు కుంభకోణం: సీఎం బావమరిదికి సంబంధించిన బొగ్గు స్కామ్‌ను హరీశ్ రావు బయటపెట్టిన కొద్దిసేపటికే నోటీసులు రావడంపై ఆయన

# సంపాదకీయం

## ఈ గొడవ స్త్రీల దుస్తుల గురించి కాదు

ఇటీవల ఇద్దరు తెలుగు సినిమా హీరోయిన్లు షాపింగ్ మాల్స్‌కు వెళ్ళినప్పుడు చుట్టూ వున్న మగాళ్లు వారిని బహిరంగంగా వేధించారు. ఆ మగాళ్ల ముఖాలు స్పష్టంగా కన్పిస్తున్నప్పటికీ పోలీసులు వారి మీద ఏ కేసులూ పెట్టలేదు. అనుమతి లేకుండా ఆడవాళ్ళ శరీరాన్ని ముట్టుకోవటానికి ప్రయత్నించటం, తాకటం, బట్టలు లాగటం, లైంగిక వేధింపుల కిందకు వస్తాయని వారికి తెలియంది కాదు. ఆయా ఆడవాళ్లు ఎందుకు ఫిర్యాదు చెయ్యలేదు అనటానికి ఇవెక్కడో రహస్యంగా జరిగినవి కూడా కాదు. ఈ సంఘటనలను కేవలం సెలెబ్రిటీ సంస్కృతిలో భాగమని కొట్టిపడెయ్యలేం. హెూలీ పండుగప్పుడు ఉత్తర భారతదేశంలో, కొత్త సంవత్సర వేడుకలప్పుడు బెంగళూరులో, గోవాలో ఇలా బహిరంగ వేధింపులు జరుగుతాయని వార్తల్లో వింటూనే వున్నాం. దీనికున్న చారిత్రక సాంస్కృతిక కారణాలు లోతయినవే బహిరంగ స్థలాల్లో తమ కుటుంబ మగవాళ్ళతో కాకుండా తమంతట తాము స్వేచ్ఛగా తిరిగే ఆడవాళ్ళను భారతీయ మగస్వామ్యం 'అందరికీ చెందిన ఆడవాళ్ళు'గా పరిగణిస్తుంది. తరతరాలుగా భూస్వామ్య సంస్కృతిలో అధికార కులాల మగవాళ్ళు శ్రామిక వర్గ-- కుల స్త్రీలను హక్కుగా వాడుకున్న అలవాటు వల్ల, ఇంటికి బందీ అయ్యి ఉండకుండా బయట తిరిగి, పనిచేసే ఆడవాళ్ళందరినీ తక్కువ చూపు చూసే అలవాటు బలంగా వేళ్ళూనుకుని వుంది. ఆ చూపు ఆడవాళ్ళను 'మర్యాదస్థులు' 'అమర్యాదస్థులు' అని విభజిస్తుంది. ఈ కనిపించని గీతకు సరయిన వైపు ఉండటానికి, అంటే తమను తాము మర్యాదస్థులని నిరూపించుకోవటానికి, ఈ దేశంలో ప్రతి మహిళా, నాతో సహా, తన శరీరాన్ని, ఆహార్యాన్ని, నడకను, నడవడికను ఎప్పటికప్పుడు పోలీసింగ్ చేసుకుంటూ ఉంటుంది. నటీమణుల వేధింపుల విషయంలో ఇంకొక పార్శ్వం కూడా వుంది. ఒక శతాబ్దం క్రితం వరకూ, తీరికగా కళను అభ్యసించి, వాటిలో నైపుణ్యం తెచ్చుకున్న ఆడవాళ్ళందర్నీ కొన్ని ప్రత్యేక సమూహాల కింద పరిగణించేవారు. తవాయిఫ్, దేవదాసీ, కళావంతులు, భోగంవాళ్ళు-- అని వివిధ పేర్లున్న ఈ సమూహాల స్త్రీలు నృత్యం, సంగీతం, ఇతర కళల్లో ఆరితేరి జమీందార్లు, రాజులు, జాగీర్దార్లు, ఇతర వ్యాపారస్థులను అలరించి, ప్రతిఫలంగా ఆస్తిని పొంది, స్వతంత్రంగా బతికేవాళ్ళు. రాచరిక--భూస్వామ్య పితృస్వామ్యంలో వీరికొక స్థానం ఉండేది. అన్ని రకాల నృత్యాలు, సంగీతాలను శతాబ్దాలపాటు కాపాడింది ఈ సమూహాల స్త్రీలే. హిందీ సినిమాల నుంచి తమిళ, తెలుగు సినిమాలలోకి మొదట ప్రవేశించిన నటీమణులలో అనేకమందికి ఈ కళా సమూహాల నుంచి వచ్చిన నేపథ్యం ఉంది.అయితే, ఇలా కుటుంబాల బయట స్వతంత్ర స్త్రీలు ఉండటం బ్రిటిష్ మగస్వామ్యానికి నచ్చక 19వ శతాబ్దపు రెండవ భాగంలో కొత్త చట్టాలు తీసుకొచ్చి, వీళ్ళపై అమర్యాదస్థులు అని ముద్ర వేసి, వాళ్ళ ఆస్తిని, భూమిని లాగేసుకుని, వారిని అందరికీ శరీరాన్ని అమ్ముకునే స్త్రీలుగా దిగజార్చింది. ఈ మార్పులో అప్పటికి రూపుదిద్దుకుంటున్న భారతీయ మధ్యతరగతి మగస్వామ్యం కూడా అత్యుత్సాహంగా పాల్గొంది. జాతీయోద్యమం సమయంలో బ్రిటిష్ విక్టోరియన్ భావజాలాన్ని తమదిగా చేసుకున్న మధ్యతరగతి మగస్వామ్యం బలపడింది. అది ఇటువంటి 'అమర్యాద కరమైన' సమూహాల స్త్రీల నుంచి సంగీతాన్ని, నృత్యాన్ని ఉద్ధరించే కార్యక్రమం చేపట్టింది. వీరేశలింగం వంటి మొదటితరం మగ సంఘసంస్కర్తలు ఈ చర్యలకు మద్దతు ఇచ్చారు. ఈ మధ్యతరగతివారు తమ కుటుంబాల స్త్రీలకు కొంత సంగీతాన్ని, నృత్యాన్ని నేర్పించటంతో మొదలుపెట్టి, ఆ కళారూపాల నుంచి శృంగార సంబంధిత పార్శ్వాలన్నింటినీ 'అశ్లీలం' పేరుతో తీసిపడేసి, దైవభక్తికి ముడేసి, వాటిని 'శాస్త్రీయ' కళలుగా మార్చారు. ఆ క్రమంలోనే సదిర్ నుంచి భరతనాట్యం రూపొందింది. ఇక వీరు అమర్యాదకరమని ముద్ర వేసిన అసలైన కళా సమూహాలు సెక్స్ వర్క్ లేదా సాధారణ రికార్డింగ్ నృత్యాల వంటి ప్రమాదకరమైన లైంగిక శ్రమలోకి నెట్టివేయబడ్డాయి. కుల, వర్గ, మగస్వామ్య సంస్కృతి ఈ రెండిటి మధ్య గీతను గీసి, నియంత్రించింది. 1947 తర్వాత పోషక వర్గ మగస్వామ్య చూపుతో రూపుదిద్దుకున్న సినిమావరణం, మధ్యతరగతి మగవాళ్ళకు ఒక పక్క రికార్డింగ్ డాన్సులు, మరో పక్క శాస్త్రీయ నృత్యరూపాలు, ఈ రెండిటినీ ఒకే తెర మీద చూపించింది. పౌరాణిక, జానపద సినిమాల్లో మగ ఋషుల తపస్సును భగ్నం చెయ్యటానికో, దేవేంద్రుడి సభలో రంభా ఊర్వశి నృత్యాలనో, రాజుసభలో నృత్యమనో, మగ కవికి ఉత్సాహం అందించటానికో, మగ హీరోల శృంగార కలల్లోనో వివిధ రకాల శృంగార శాస్త్రీయ నృత్య రూపాలు వాడారు. సాంఘిక సినిమాలు పెరిగాక, మగ పాత్రలు క్లబ్బుకు వచ్చినప్పుడు మర్యాదస్థులు కాని స్త్రీలు కాబట్టి, వాళ్ళతో రికార్డింగ్ నృత్యాలు చేయించారు.

సినిమాల్లో శృంగార నృత్యాలు, సంసార పాత్రలు, క్లబ్బు నృత్యాలు... ఏం చేసే స్త్రీలకయినా, మధ్యతరగతి కుటుంబ స్త్రీలకు లేని స్వతంత్ర జీవితం, డబ్బు, స్వేచ్ఛ వృత్తిరీత్యా లభిస్తుంది. అయితే, మగస్వామ్య ద్వంద్వ విలువలను కాపాడటం కోసం, ప్రేక్షకుల కోసం తెరమీద ఎంత రిస్కీ పాత్ర పోషించినా, బయట మాత్రం సంప్రదాయ మహిళల వలె మగ ఆధారిత జీవన విధానాన్ని అనుకరించాలి. కొంతమంది పెట్టి పుట్టిన వాళ్ళు తప్ప ఎవరూ తమ స్వతంత్రతను చూపించుకోలేరు. 1990లలో ఆర్థిక ఉద్దీపన విధానాల అనంతరం లైంగికత, శరీరం, బట్టల గురించిన విలువలు తీవ్ర గతిన మారిన తర్వాత, గత ఇరవయ్యేళ్ళల్లో తెరపై జీవితానికి, తెర బయట జీవితానికి మధ్య తేడా చెరిగి, హీరోయిన్ల స్వతంత్ర జీవితం కొంత వెలుగులోకి వచ్చింది. తమది కాని సంప్రదాయ జీవితాన్ని నటించాల్సిన ఒత్తిడి కొంత తగ్గింది.కానీ తెలుగు మగస్వామ్య చూపు ఇంకా బలంగా నిలబడే ఉంది. వెల్లువలా వచ్చిన సాంస్కృతిక మార్పును పక్కకు తోసి నయానో భయానో కొంత స్వతంత్రం, అధికారం, సమానత్వం రుచి చూసిన ఇటువంటి ఆడవాళ్లను బట్టల పేరుతో కట్టడి చెయ్యాలని చూస్తోందది. 19వ శతాబ్దపు మగ సంస్కర్తలు తాము ఆడవాళ్ళ ఉద్ధరణ కోసమే అంతా చేస్తున్నామని భావిస్తే, ఇప్పటి సినిమా--మీడియా సంస్కర్తలు స్త్రీల రక్షణ కోసమే ఇదంతా చేస్తున్నామని అంటున్నారు.

19వ శతాబ్దపు చివర్లో బ్రిటిషు వాళ్ళు తీసుకొచ్చిన మార్పులను దేవదాసీ సమూహానికి చెందిన బెంగళూరు నాగరత్నమ్మ వంటి స్త్రీలు-- ముద్దు పళని రాసిన శృంగార కావ్యం 'రాధికా సాంత్వనం' ప్రచురించి వ్యతిరేకించారు. కొన్ని దశాబ్దాల తర్వాత 20వ శతాబ్దంలో ముత్తు లక్ష్మరెడ్డి వంటి మరి కొంతమంది కళలు, కళారూపాలు సంతరించుకున్న కులస్వామ్య రూపాన్ని వద్దన్నారు.

## ఏపీలో టాటా గ్రూప్ ప్రాజెక్టులు వేగవంతం చేయండి: సీఎం చంద్రబాబు

దావోస్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తో టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ ఏడాది దావోస్ పర్యటనపై ముఖ్యమంత్రిని.. చంద్రశేఖరన్ అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ పారిశ్రామిక రంగ పోకడలు, పారిశ్రామిక వేత్తల ఆలోచనలు తెలుసుకోవడానికి ఇదో మంచి వేదిక అని సీఎం అన్నారు. ఏపీని బ్రాండ్ చేయడానికి, కొత్త పాలసీలపై మార్కెట్‌లో అంచనా వేయడానికి ఈ పర్యటన ఎంతో దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. 2025 దావోస్ పర్యటనలో జరిపిన చర్చల్లో ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని చంద్రబాబు చెప్పారు.

మూడు రోజులు వేర్వేరు సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఏఐ, అగ్రికల్చర్, టూరిజం వంటి రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న విజయాలు వివరించామన్నారు. గతంతో పోలిస్తే భారత్ పట్ల ప్రపంచ దిగ్గజ సంస్థలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. యువశక్తి, సమర్థ నాయకత్వం, పాలసీల కారణంగా నేడు ప్రతీ రంగంలో భారత్‌లో కంపెనీల స్థాపనకు అవకాశాలు పెరుగుతున్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ రంగాల్లో ప్రపంచ దిగ్గజ కంపెనీల ఆలోచనలు, తన అనుభవాలను టాటా సన్స్ ఛైర్మన్ పంచుకున్నారు. విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్, అమరావతి క్వాంటం వ్యాలీ, కర్నూలులో తలపెట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా చేపట్టే కార్యక్రమాల నిర్వహణపై టాటా ట్రస్ట్ నుంచి ప్రత్యేకంగా అధికారులను పంపి దీనిపై చర్చిద్దామని చంద్రశేఖరన్ చెప్పారు. రాష్ట్రంలో టాటా గ్రూపు చేపట్టిన టూరిజం ప్రాజెక్టులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో 3 స్పోర్ట్స్ సిటీలు నిర్మించే ఆలోచనలో ఉన్నామని, ఈ రంగంలో పెట్టుబడులకు అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో టాటా గ్రూప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరగా అన్నింటినీ సమీక్షంచి ప్రాజెక్టుల పూర్తికి సహకరిస్తామని టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ తెలిపారు.

## తిరుమలలో 'రథసప్తమి'..

మొదటి పేజీ తరువాయి

తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఏర్పాట్ల వివరాలను ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు.

"రథసప్తమి రోజున ఏడు వాహనసేవలపై మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై.. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో వాహనసేవలు ముగుస్తాయి. వైకుంఠ ద్వార దర్శనాలు, బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం. అలాగే రథసప్తమి వేడుకలను కూడా వైభవంగా నిర్వహిస్తాం. రద్దీ దృష్ట్యా తిరుపతిలో 24 నుంచి 26 వరకు సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీ రద్దు చేశాం. మాడవీధుల్లో 3,700 మంది శ్రీవారి సేవకుల సాయంతో 14 రకాల వంటకాలతో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. 1,260 మంది పోలీసులు, 1200 మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రతా ఏర్పాట్లు చేశాం. ఆర్టీసీ బస్సుల ద్వారా 2,300 ట్రిపులు నడిచేలా ప్రణాళికలు రూపొందించాం. వాహనసేవల ముందు 56 కళా బృందాలతో ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయి. 2.50 లక్షల మంది భక్తులు రథసప్తమి వేడుకలకు వస్తారని అంచనా" అని తెలిపారు. అంతకుముందు తిరుమలలోని నాలుగు మాడవీధుల్లో తితిదే అధికారులతో కలిసి బీఆర్ నాయుడు తనిఖీలు చేశారు. రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తుల సౌకర్యాలపై తితిదే, విజిలెన్స్ అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు.

## ట్రక్కును ఢీకొన్న రైలు.. తప్పిన పెను ప్రమాదం!



ఝూరండ్‌లో పెనుప్రమాదం తప్పింది. రైల్వే క్రాసింగ్ వద్ద పట్టాలపై నిలిచి ఉన్న ఓ ట్రక్కును రైలు ఢీకొంది. అయితే, ఈ ఘటన లో ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి.

రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవ్‌ఘర్ జిల్లాలోని నవాదిహ్ రైల్వే క్రాసింగ్ వద్ద భారీ ట్రాఫిక్ కారణంగా ఓ ట్రక్కు అక్కడే పట్టాలపైనే నిలిచింది. అంతలోనే వచ్చిన గోండా- ఆసన్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు.. ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొంది. ట్రక్కు పక్కకు జరిగిన దృశ్యాలు వీడియోలో రికార్డయ్యాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం కలగలేదని జాసిడిహ్ స్టేషన్ మేనేజర్ శంకర్ శైలేష్ వెల్లడించారు.

ప్రమాదం కారణంగా జాసిడిహ్- ఆసన్‌సోల్ మార్గంలో రైళ్ల రాకపోకలకు సుమారు రెండు గంటల పాటు అంతరాయం ఏర్పడిందని ఆసన్‌సోల్ రైల్వేడివిజన్ అధికారి తెలిపారు. దెబ్బతిన్న ఇంజిన్‌ను తొలగించామని, ఈ ఘటనపై విచారణకు నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు.

## మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా?: కేటీఆర్



రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాదు.. అసమర్థ పాలన. మేము ఏ తప్పూ చేయలేదు.. ఎవరికీ భయపడేది లేదు. కేవలం రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సిట్ విచారణకు కచ్చితంగా హాజరవుతా. ఫోన్ ట్యాపింగ్ కేసులో సంబంధంలేని నేతలను ప్రశ్నించారు. సిట్ అధికారులను కూడా కొన్ని ప్రశ్నలు అడుగుతా. నా ఫోన్ ట్యాప్ అవుతుందా? అని సిట్ అధికారులను అడుగుతా. ఫోన్ ట్యాపింగ్ ప్రభుత్వాలు చేయవు.. పోలీసు వ్యవస్థ చేస్తుంది. శివధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి వంటి అధికారులను ప్రశ్నించట్లేదు. మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయట్లేదని ప్రమాణం చేసి చెబుతారా? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని చెబితే ఖండించలేదు" అని కేటీఆర్ అన్నారు.

## 'టీమ్ ఇండియా' అని పిలవొద్దంటూ పిటిషన్:

మొదటి పేజీ తరువాయి

బీసీసీఐ నేతృత్వంలో ఏర్పాటైన జట్టును 'టీమ్ ఇండియా'గా అభివర్ణించకుండా ప్రసారభారతికి ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి పిటిషన్లతో కోర్టులపై భారం మోపొద్దంటూ పిటిషనర్‌కు చురకలంటించింది.

న్యాయవాది రీపక్ కన్సల్ ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రైవేటు సంస్థ అయిన బీసీసీఐ నేతృత్వంలోని జట్టును 'టీమ్ ఇండియా' 'భారత జాతీయ జట్టు' అని పిలవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. దీనికి కేంద్రం నుంచి కూడా ఎలాంటి అనుమతులు లేవని వాదించారు. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. 'మీరు ఇంట్లో కూర్చుని ఇలాంటి పిటిషన్లు తయారుచేస్తున్నారు. ఈ పేరుతో మీకు వచ్చిన సమస్య ఏంటి?' అని ధర్మాసనం న్యాయవాదిని ప్రశ్నించింది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతిచోటా ఆ జట్టు ఆడుతున్న విషయాన్ని ప్రస్తావించింది. ఈ పిటిషన్ దాఖలు చేయడం కోర్టు సమయంతో పాటు మీ సమయాన్ని కూడా వృథ చేయడమేనని మండిపడింది.

## ఇండిగోకు 'డిసెంబర్' దెబ్బ.. లాభంలో 78 శాతం క్షణత

మొదటి పేజీ తరువాయి

దిల్లీ: ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ గురువారం త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.549.1 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2448.8 కోట్ల లాభంతో పోలిస్తే 78 శాతం క్షణత నమోదైంది. కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు, గతేడాది డిసెంబర్‌లో తలెత్తిన విమాన సేవల్లో అంతరాయం వంటివి లాభాలపై ప్రభావం చూపాయి.కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ.969 కోట్లు, కార్యకలాపాల అంతరాయాల కారణంగా రూ.577 కోట్లు ఖర్చయినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. మొత్తంగా ఈ త్రైమాసికంలో రూ.1546 కోట్లు ప్రభావం పడినట్లు పేర్కొంది. కరెన్సీ లావాదేవీలకు సంబంధించి డాలర్ ఆధారిత భవిష్యత్ చెల్లింపుల కోసం మరో రూ.1,035 కోట్లను డిసెంబర్ త్రైమాసికంలో మినహాయించినట్లు ఇండిగో పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.24,540.6 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.22,992.8 కోట్లతో పోలిస్తే కాస్త పెరిగింది. గతేడాది డిసెంబర్‌లో వందలాది విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో టికెట్ మొత్తాలను కంపెనీ రిఫండ్ చేసింది. ప్రయాణికులకు పరిహారం చెల్లించడంతో పాటు, గుడ్‌వెల్ గెశ్చర్ ఓచర్ల కింద ఒక్కో ప్రయాణికుడికి రూ.10వేలు చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో పాటు ఇటీవల డీజీసీఏ ఇండిగోకు రూ.22 కోట్ల జరిమానా విధించడంతో పాటు రూ.50 కోట్లు బ్యాంక్ గ్యారెంటీ చెల్లించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 10 వరకు వింటర్ షెడ్యూల్‌లో 10 శాతం కోత పెట్టింది. ఈ ప్రభావం తాజా త్రైమాసిక ఫలితాల్లో కనిపించింది. రాబోయే త్రైమాసికంలోన ఈ ప్రభావం పడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## మూడు రోజుల నష్టాలకు బ్రేక్.. రాణించిన సూచీలు

మొదటి పేజీ తరువాయి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ఈయూపై విధించిన టారిఫ్‌లపై ట్రంప్ వెనక్కి తగ్గడం, భారత్‌తో త్వరలో అద్భుతమైన ట్రేడ్ డీల్ ఉండబోతోందంటూ దావోస్ వేదికగా ఆయన చేసిన ప్రకటన మార్కెట్‌లో ఉత్సాహాన్ని నింపింది. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ వేస్తూ సూచీలు లాభాలతో ముగిశాయి.సెన్సెక్స్ ఉదయం 82,459.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,909.63) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,783.18 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 397.74 పాయింట్ల లాభంతో 82,307.37 వద్ద ముగిసింది. నిఫ్టీ 132.40 పాయింట్ల లాభంతో 25,289.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠాల నుంచి కాస్త కోలుకుని 91.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బీఈఎల్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నెల్, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.55 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4824 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## జూన్ తర్వాత మళ్లీ రాజకీయ ప్రవేశం గురించి చెబుతా: విజయసాయిరెడ్డి

మొదటి పేజీ తరువాయి

మద్యం స్కామ్ అనేదాన్ని నేను నమ్మడం లేదని చెప్పా. నేను రూ.వందల కోట్లు సంపాదించానని కోటరీ ఆరోపణలు చేసింది. నా కుమార్తెను ఇచ్చినంత మాత్రాన ఆ ఆస్తులన్నీ నావి కావు. విశాఖలో ఆస్తులు సంపాదించానని నాపై దుష్ప్రచారం చేశారు. నా ఆస్తులని రుజువైతే రాజకీయాల నుంచి తప్పుకొంటానని చెప్పా. విశాఖలో ఒక్క అపార్ట్‌మెంట్ తప్ప నాకేమీ లేదు. నాపై దుష్ప్రచారం చేసిన వారికి సరైన బుద్ధి చెప్పాలని కోరుకుంటున్నా. నాకు సంబంధంలేని విషయాల్లో నన్ను ఇరికించారు.విజయసాయిరెడ్డి భయపడే వ్యక్తి కాదు. అధికారం అనేది ఎవరికీ శాశ్వతం కాదని గ్రహించాలి. నేను రాజకీయాల నుంచి విరమించుకోలేదు. రాజకీయాల్లో స్ట్రాటజీ ఉండాలి.. అలాగే ముందుకెళ్లాలి. ఏడాదిగా నేను వ్యవసాయం చేసుకుంటున్నా. అప్పుడప్పుడు ట్వీట్లు మాత్రమే పెట్టా. నేను ఎవరినీ విమర్శించలేదు.. జగనే నన్ను విమర్శించారు. విజయసాయి ఎవరి వద్ద చెయ్యి చాచడు. నాపై చేసిన వ్యాఖ్యలను జగన్ విత్‌డ్రా చేసుకోవాలి. జగన్ వద్ద నేను పాలేరులా పనిచేశా. కోటరీ మాటలు నమ్మి పొగబెట్టి బయటకు పంపించారు. నా సమాధానాలు కొన్నింటిని ఈడీ అధికారులు రికార్డు చేశారు. మరి కొన్ని సమాధానాలు మాత్రం రికార్డు చేయలేదు. మద్యం స్కామ్ జరిగిందా? లేదా? అని అడిగారు. నాకు తెలియదని చెప్పా. ఆ స్కామ్‌లో ఉన్నవారినే అడగాలని చెప్పా. నెంబర్-2 మీకు తెలియదా అని అడిగారు. ప్రాంతీయ పార్టీల్లో నెంబరు-2 స్థానం ఉండదు. నెంబరు-2 అని నాపై ముద్రవేశారు. కేసుల విషయంలో నేను నెంబర్-2 అవుతాను. లాభాల విషయంలో మాత్రం నా స్థానం వంద తర్వాతే. నన్ను మళ్లీ విచారణకు పిలుస్తారని అనుకుంటున్నా" విజయసాయిరెడ్డి తెలిపారు.



# ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయండి.

**- ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జాలిగపు శిరీష పిలుపు.**

జనవరి 25 నుండి 28 వరకు హైదరాబాద్ నగరంలో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14జవ జాతీయ మహాసభల ప్రారంభ రోజు 25 వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జాలిగాపు శిరీష పిలుపునిచ్చారు. గురువారం రోజున సిద్దిపేట అర్బన్ శ్రీనగర్ కాలనీలో ఐదవ 14 వ జాతీయ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జాలిగాపు శిరీష మాట్లాడుతూ యువతీ--యువకులు దేశ భవిష్యత్తు భరించాల్సిన బాధ్యత ఉన్నదని, వారికి సరైన మార్గదర్శనం కోసం మహిళా సంఘం వివిధ ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. విద్యపై దృష్టి పెట్టాలని, మత్తు పదార్థాలు--మద్యపానం వంటి చెడు అలవాట్లను విడనాడాలని యువతకు పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న దాడులకు మద్యం, అశ్లీలత వంటి సామాజిక వ్యాధులే కారణమని పేర్కొంటూ, ప్రభుత్వాలు వీటిని నిరోధించడంలో గట్టి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఐద్వా పోరాటాల ఫలితంగా మహిళలకు అనేక చట్టాలు, రక్షణలు లభించాయని అయినప్పటికీ నేరాలు తగ్గకపోవడం తీవ్రమైన ఆందోళనకర విషయం అని వ్యాఖ్యానించారు. బిల్కిస్ బానో కేసు ఉదాహరణగా తీసుకుంటూ, నిందితులు ఎదేక్షగా తిరుగుతూ బాధితులు శిక్షపడుతున్న పరిస్థితి ప్రభుత్వాల వైఫల్యాన్ని చూపుతోందని విమర్శించారు. బిల్కిస్ కుటుంబానికి అండగా నిలిచి పోరాడి నిందితులను తిరిగి జైలుకు పంపించడంలో మహిళా సంఘం పాత్ర చారిత్రకమని ఆమె తెలిపారు. గృహ హింస చట్టం, ఆస్తి హక్కు చట్టం, మహిళలకు రిజర్వేషన్లు -



-- ఇవన్నీ ఐద్వా ఉద్యమాల ఫలితమని ఆమె గుర్తుచేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 33% మహిళా రిజర్వేషన్ చట్టం అమలులో ఘోరంగా విఫలమైందని పేర్కొంటూ వెంటనే చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళల అభ్యున్నతి కోసం భవిష్యత్ ఉద్యమాలకు సంబంధించిన తీర్మానాలు జాతీయ మహాసభలలో ఆమోదించనున్నట్లు, దేశవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఐద్వా జాతీయ మహాసభలు జరగడం ఇదే మొదటిసారి అని ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువత కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఇతర ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25 న జరగనున్న బహిరంగ సభ కు జాతీయ నాయకులు హాజరవుతారని, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు దండు లక్ష్మి, హరిత, సిరసనగండ్ల రజిని, మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అమృత్ నగర్ తండావాసులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయింపు

ఫతేనగర్ డివిజన్ అమృత్ నగర్ తండావాసుల 40 ఏళ్ల స్వప్నం సాకారం కాబోతుంది. ఇక్కడ నివసిస్తున్న ఎస్ సి, ఎస్ టీ నివాసితులకు పట్టాలు మంజూరు చేసి కైతలాపూర్ దగ్గర్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వ నుంచి బుధవారం శుభవార్త అందింది దీంతో ఈ తండావాసుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది ప్రజాసమస్యల పరిష్కారంలో భాగంగా గత నవంబర్లో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్ ఈ తండాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు తండావాసులు తాము ఇక్కడ 40 ఏళ్లుగా ఉంటున్నామని ఎలాంటి సౌకర్యాలు లేవని రోడ్లు తాగునీరు వంటి





కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని రమేష్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి మరియు మన ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత సలహాదారు వేం నరేంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు .దీనిపై వారు ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. దీంతో అధికారులు తండావాసులకు డబుల్ బెడ్ ఇళ్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఇళ్లలో చిన్న చిన్న మరమ్మతులు చేయాల్సి ఉందని వాటిని పూర్తి చేసిన వెంటనే వాసులను ఇక్కడికి తరలించి వారికి అవసరమైన ధ్రువపత్రాలను అందజేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. తమ సమస్యను ఎన్నో ఏళ్లుగా గత ప్రభుత్వం దృష్టికి స్థానిక శాసనసభ్యుడికి చెప్పుకున్నా ఎలాంటి స్పందన లేదని తమ బస్తీని సందర్శించిన కేవలం రెండు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయింపజేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించడం చాలా ఆనందంగా ఉందని తండావాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఫతేనగర్ డివిజన్ ప్రెసిడెంట్ కుక్కల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హమీద్, శివ చౌదరి, అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిద్దాం..

**- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్.**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి సంబంధించి రానున్న ఎన్నికల్లో 20 వార్డుల్లో బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను కోరుతూ గురువారం 17 వ వార్డులో బీ ఆర్ ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ



మాజీమంత్రి కేసీఆర్ నేతృత్వంలో గజ్వేల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో ఎంతో ముందుకు వెళ్లిందని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గనికి ఎమ్మెల్యేగా కేసీఆర్ ఉండటం మన అదృష్టం అని అన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీకి ఎన్నో నిధులు కేటాయించి గజ్వేల్ మున్సిపాలిటిని దేశానికి రోల్ మోడల్ గా నిలిపిన ఘనత గత కెసిఆర్ ప్రభుత్వంది అన్నారు. అనేక రాష్ట్రల ప్రజాప్రతినిధులు నేడు గజ్వేల్ ని సందర్శించి ఇక్కడి అభివృద్ధి చూసి నేర్చుకుంటున్నారని అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చక ఒక కోటి రూపాయల నిధులు కూడా గజ్వేల్ మున్సిపాలిటీకి నిధులు కేటాయించిన దాఖలు లేవన్నారు. గజ్వేల్ లో నెలకొన్న ప్రధాన సమస్య మంచినీటి సమస్య తీర్చి గజ్వేల్ ప్రజల దాహార్తిని తీర్చిన కేసీఆర్ కి ఓటు వేయాలని అన్నారు. ఇక్కడ అభివృద్ధి ఎవరు నిల్చున్న కారు గుర్తు కేసీఆర్ ని చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈరోజు నుండి మనందరిది ఒకటే నినాదం అని కారు గుర్తుంచుకొని మనం అందరం కలిసి కట్టుగా అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ జఖి ఉద్దీన్, కళ్యాణ్ కార్ నర్సింగరావు, మామిడి శ్రీధర్, శంకర్, వార్డు ఇంచార్జ్ మద్ది రాజిరెడ్డి, రమేష్ గౌడ్, అహ్మద్, బిమప్ప, దశరథ, జహంగీర్, షాదుల్, కరీం, హన్మంతరెడ్డి. బాల్ రాజు గౌడ్,నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ట్రాఫిక్ కి అనుగుణంగా సమస్య లను అధిగమించే చర్యలు ..

**- ఎమ్మెల్యే, పి ఎ సి చైర్మన్ అరికపూడి గాంధీ..**

హాఫీజ్పేట్ డివిజన్ పరిధిలో ని వైశాలి నగర్ నుండి మసీదు బండ వైపు రోడ్డు లో గల రైల్వే అండర్ పాస్ వద్ద నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్య తో ఇబ్బందులకు గురిఅవుతున్నాం అని కాలనీ వాసుల విజ్ఞప్తి మెరుకు రైల్వే అండర్ పాస్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై తీసుకోవాల్సిన చర్యలపై గురువారం రోజు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ , ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ , అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ హన్మంత రావు , ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి , ట్రాఫిక్ సిఐ సురేష్ మరియు పలు కాలనీల అసోసియేషన్ సభ్యులతో కలిసి పరిశీలించిన పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ .ఈ సందర్భంగా పి ఎ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. హాఫీజ్పేట్ మంజీర రోడ్డు నుండి మసీదు బండ కు వెళ్లే లింక్ రోడ్డు లో గల రైల్వే అండర్ పాస్ వద్ద ఉదయం ,సాయంత్రం తీవ్ర ట్రాఫిక్ సమస్య తో ఇబ్బందులు ఎదురుకొంటున్నాం అని అండర్ పాస్ సమీపంలో నివసిస్తున్న సుమారు 15 కాలనీల అసోసియేషన్ సభ్యులు కొద్దీ రోజుల క్రితం నాకు వినతిపత్రం సమర్పించడం ద్వారా నా దృష్టికి రావడం జరిగినది అని, అట్టి విషయం అయి ఈ రోజు ట్రాఫిక్ అధికారులతో కలిసి పరిశీలించడం జరిగినది అని పి



ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ట్రాఫిక్ సమస్య ను శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని,ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని, ప్రజల ట్రాఫిక్ ఇక్కట్లను తీర్చాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కారాని కై తీసుకోవాల్సిన చర్యల పై చర్చించడం జరిగినది అని అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగినది అని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలిపారు. భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకొని ప్రజలను ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చే విధంగా చర్యలు చేపడుతామని, ట్రాఫిక్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జి హెచ్ ఎం సి ఇంజనీరింగ్ విభాగం అధికారులు డి ఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు సేవ చేయడం నిజమైన సంతృప్తి

**- జి ఎం టి కోఆర్డినేటర్ లైన్స్ క్లబ్ 320 డి లయన్ పరమేశ్వర చారి**



జనవరి 26 న తన జన్మదినాన్ని పురస్కరించుకొని శివారు వెంకటాపూర్ పాఠశాల విద్యార్థులకు నాలుగు కార్పేట్లను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమంలో తను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకుంటున్నారు. వారికి ఏదో రకంగా తోడ్పాటున అందించాలి అనే ఉద్దేశంతో గురువారం కార్పెట్లను ఇవ్వడం జరిగింది. అని అదేవిధంగా విద్యార్థులు చిన్నప్పటి నుంచి మంచి క్రమశిక్షణను ఏర్పాటు చేసుకొని పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలని తల్లిదండ్రులకు అదే విధంగా గ్రామస్తులకు సమాజానికి ఉపయోగపడేటువంటి పౌరులుగా తయారవ్వాలని సూచించనైనది. ఇట్టి కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ ప్రెసిడెంట్ ఉప్పల మెట్టయ్య మాట్లాడుతూ విద్యార్థులకు అతి త్వరలోనే ఐదు కంప్యూటర్ టేబుల్ లను ఇప్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ మల్లేశం గౌడ్ గారు లైన్స్ క్లబ్ మైత్రి అల్వాల్ ప్రెసిడెంట్ రమణారావు, స్థానిక సర్పంచ్ తుమ్మల కనకయ్య, మండల విద్యాధికారి శ్రీ వెంకట్ రాములు, పిఆర్ టి యు మర్కుక్ మండల ప్రెసిడెంట్ శ్రీనివాసరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూచి రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు కొత్త నరేందర్ రెడ్డి ఉపాధ్యాయులు తుమ్మ.కుమార్, సృజన, పద్మజ విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం అయినది.

# అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్టకు 2 సంవత్సరాలు పూర్తి

**- 11కోట్ల లిఖిత శ్రీరామ నామాలతో శ్రీరాముని అభిషేకం**
**- అద్దాల మందిరం వద్ద దీపాలు వెలిగించిన**
**- భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**
**- దేశానికి, ఆధ్యాత్మిక శక్తి ఐక్యతకు రామజన్మ భూమి ప్రేరణ**



అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ట జరిగి నేటికీ 2 సంవత్సరాలు పూర్తి అయిన శుభ సందర్భంగా గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని అద్దాల మందిరం వద్ద 11 కోట్ల లిఖిత శ్రీరామ నామాలతో సీతారాములకు ప్రత్యేకంగా అభిషేకించారు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు. దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామ అంటే రోమా రోమాన్ని మై మరపించే మహా మంత్రం రామ మంత్రం అన్నారు. శాశ్వత మైనది రామ నామమే అన్నారు. ప్రతి ఒక్కరు రామకోటి లిఖించి తరించాలన్నారు. ధర్మం, సత్యం, భక్తి, జాతీయ గర్వానికి ప్రతీకగా నిలిచిన శ్రీరామ జన్మభూమి మందిరం దేశానికి ఆధ్యాత్మిక శక్తి, ఐక్యతకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు.

# అప్పల శ్రీకాంత్ యాదవ్ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించిన బేరి రామచంద్ర యాదవ్.



రాయదుర్గం దర్గా అప్పల శ్రీకాంత్ యాదవ్ స్వగృహంలో జరిగిన పెద్దకర్మలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మరియు బిసి ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ పాల్గొని నివాళులర్పించి పూలు అర్పించి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి శ్రీకాంత్ యాదవ్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ నివాళులర్పించడం జరిగింది. శ్రీకాంత్ పెద్దకర్మ కార్యక్రమంలో బంధువులు మిత్రులు అందరు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. దర్గా రాయదుర్గం అప్పల మల్లేష్ యాదవ్ యాదవ సంఘం అధ్యక్షులు అప్పుల కృష్ణ యాదవ్ అల్లాడి యాదయ్య యాదవ్ అప్పల రమేష్ యాదవ్ మల్లేష్ యాదవ్ చంద్రశేఖర్ యాదవ్ రమేష్ యాదవ్ లక్ష్మీకాంత్ యాదవ్ మల్లేష్ యాదవ్ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది.

# ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ...



మనోహరాబాద్ మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా గురువారం నాడు ఆయన నూతన సర్పంచ్ రాజనర్సింహ మాజీ సర్పంచ్ ప్రభావతి పెంటయ్య. ఇతర పాలకవర్గ సభ్యులతో కలిసి విద్యార్థులకు ఉపాధ్యాయుల మధ్య అందజేశారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు వార్డు సభ్యులు తదితరులు యువకులు పాల్గొన్నారు..

## - మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులతో మున్సిపల్ ఎన్నికల బరిలోకి మీ కొరబోయిన సరస్వతి

**- 12 వార్డు అభివృద్ధి, సంక్షేమం కొనసాగించేందుకే నా రాజకీయ అడుగు**




తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులతో 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో నిలబడుతున్నాను. గతంలో నా కుమారుడు నాని కి అవకాశం ఇచ్చి కౌన్సిలర్ గా భారీ మెజారిటీతో గెలిపించినా నా వార్డు ప్రజల మేలు మర్చిపోలేను. మీ నమ్మకాన్ని నిలబెడుతూ గత ఐదేళ్లు మన వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కష్టసుఖాల్లో తోడుంటూ నిరంతరం మా కుటుంబం ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ఈ ఎన్నికల్లో సైతం మీ ఆదరాభిమానాలు ఆశీస్సులు మా కుటుంబం పై ఉంచి 12వ వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ నుంచి నన్ను గెలిపిస్తే మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో మన వార్డుని ఆదర్శ వార్డు గా తీర్చిదిద్దడంతో పాటు మీ కుటుంబ సభ్యురాలిగా మీ కష్టసుఖాలను పాలుపంచుకుంటూ సదా మీ సేవలో నిమగ్నమవుతాను..

# నిరుద్యోగ గర్జనతో దద్దరిల్లిన కేయూ:

**- రేవంత్ సర్కార్?పై విద్యార్థి లోకం సమర- వంచన చాలించి.. నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్**
**- పోలీస్ లాఠీలకు భయపడం: ఎబివిపిఎస్ఫ్, ఎంఎస్ఫ్, ఎస్.ఎస్.యు నేతల హెచ్చరిక**

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువతను నిలువునా వంచిస్తున్నారని విద్యార్థి సంఘాలు నిప్పులు చెరిగాయి. బుధవారం కాకతీయ యూనివర్సిటీ వేదికగా ఎబివిఎస?ఫ్, ఎంఎస?ఫ్, ఎస్.ఎస్.యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేయూ గ్రంథాలయం నుంచి సెకండ్ గేట్ వరకు వందలాది మంది విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చి, గేటు ఎదుట బైఠాయించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పరిసరాలు నిరుద్యోగ గర్జనతో దద్దరిల్లాయి. ఈ ఆందోళనను ఉద్దేశించి ఎబివిఎస?ఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్, ఎంఎస?ఫ్ కేయూ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తామని ఆశచూపిన కాంగ్రెస్,



గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగులను విస్మరించిందని ధ్వజమెత్తారు. "అభయహస్తం" హామీలన్నీ అభాసుపాలయ్యాయని, నిరుద్యోగుల ఓట్లతో గెలిచి ఇప్పుడు వారి రక్తమే కళ్లచూస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులను ప్రయోగించి లాఠీచార్జ్ చేయించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, విద్యార్థుల ఆగ్రహానికి గురికాకముందే మేల్కొని వెంటనే కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను వంచించడం మానుకోకపోతే, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగులు సమాధి కట్టడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబివిఎస్ఫ్ కేయూ అధ్యక్షులు అడ్డా రాజేష్, ప్రధాన కార్యదర్శి రాయరాల నరసింహ, ఉపాధ్యక్షులు చల్ల శ్రీకాంత్ సహా ఉదయ్, సాయి, చంటి, కళ్యాణి, ప్రసన్న, అపర్ణ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్

**- ఇల్లు లేని ప్రతి లబ్ధిదారునికి ఇల్లు ఇస్తాం**
**- పదో వార్డు మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ -ప్రవీణ్ కుమార్**



ఆందోల్- జోగిపేట మున్సిపల్ పరిధిలోని పదవ వార్డులో నూతన ఇందిరమ్మ రెండు ఇళ్ల నిర్మాణానికి పదవ వార్డు మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ- ప్రవీణ్ కుమార్ గురువారం భూమి పూజ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ పదవ వార్డుకు నూతనంగా 12 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇల్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల ఆర్థిక సాయం పొందాలని తెలిపారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీనియర్ నాయకులు గుర్రపు కృష్ణ, రాజు, రామ్ చందర్ , వినయ్,మున్సిపల్ అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై ఆన్లైన్ ద్వారానే ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మన ఇసుక వాహనం పైలట్ ప్రాజెక్ట్ అమలు : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రంలో ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా, నియంత్రిత విధానంలో అమలు చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సాండ్ మేనేజ్?మెంట్ సిస్టమ్?ను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు,అవినీతి వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కొత్త విధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఈ విధానాన్ని ముందుగా పైలట్ ప్రాజెక్ట్?గా జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యం లో తెలంగాణ రాష్ట్ర గనులు ఒ భూగర్భ శాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్?మెంట్ కార్పొరేషన్ టీజీఎండీసీ అధికారులు సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ వ్యవస్థ పని విధానం, ఇసుక బుకింగ్ విధానం, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపుల విధానం, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా మన ఇసుక వాహనం ఆన్లైన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సహా అన్ని అవసరాల కోసం మాన్యువల్ కూపన్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అనుమతి, ప్రతి రవాణా, ప్రతి లావాదేవీ పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరుగుతుందని, ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదని అన్నారు. మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్?కు అనుగుణంగా తక్షణమే ఇసుక లభ్యత ఉన్న రీచ్?లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన రీచ్?ల వివరాలు, రవాణా సామర్థ్యం, రోజువారీ సరఫరా వివరాలను సమగ్రంగా ఏడి మైన్స్ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. తద్వారా ఇసుక కొరత లేకుండా ప్రజలకు సకాలంలో సరఫరా చేయవచ్చని తెలిపారు. ఈ కొత్త విధానం సమర్థవంతంగా అమలవ్వాలంటే అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తాసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలు సహా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు ఈ వ్యవస్థపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారని, ఫీల్డ్ స్థాయిలో కూడా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, ధరల పెంపు వంటి అంశాలపై కఠిన నియంత్రణ చర్యలు అమల్లోకి వస్తాయని హెచ్చరించారు.
ఈ ఆన్లైన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగంగా, నమ్మకంగా, అవినీతి రహితంగా ఇసుక లభ్యత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఏడీ మైనింగ్ అధికారులు, పి ఓ -- టీజీఎండీసీ , సీజీజీ(హైదరాబాద్) ప్రతినిధులు, మండల స్థాయి తహసిల్దార్లు (ఎమ్ ఆర్ ఓ లు), ఎంపిడివోలు (ఎంపీడీఓ లు ) తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చౌటకూర్ మండల సర్పంచ్ లు ,పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.



అట్టి సమావేశంలో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ పరిధిలో రాబోయే వేసవికాలం దృష్ట త్రాగునీటి సమస్యల గురించి తేదీ 01.02.26 నుండి 20.02.26 వరకు 20 రోజులపాటు గ్రామంలో పర్యటించి యాక్షన్ ప్లాన్ తయారు చేయుటకు ఏఈ ఆర్డబ్ల్యూఎస్, ఏఈ గ్రేడ్ గార్లు తెలియజేయడం జరిగింది. ఎంపీడీవో కే.శంకర్ గారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు మండల పరిపాలన తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తు, ప్రజలు మీపై ఉంచిన విశ్వాసం ఎంతో గొప్పది. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం మీరు పనిచేయాల్సిన బాధ్యత ఇప్పుడు మీపై ఉంది అని,చౌటకూర్ మండలాన్ని అభివృద్ధిలో ముందుండే మండలంగా తీర్చిదిద్దేందుకు మనమంతా ఒక జట్టుగా పనిచేద్దాం. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే విధంగా నిబద్ధతతో పనిచేయాలని కోరినారు.తదుపరి మండల ప్రజా పరిషత్ చౌటకూర్ పక్షాన నూతన సర్పంచ్ లకు ఎంపీడీవో కే. శంకర్ గారు సన్మానం చేయడం జరిగింది. అట్టి సమావేశంలో తహసిల్దార్ కిష్టయ్య గారు, ఎంపీ ఓ సువర్ణ గారు, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ నాగ సాయి గారు గారు , ఏఈ గ్రిడ్ నిజాముద్దీన్ గారు, ఏపీ ఆర్ కోటేశ్వరరావు గారు, ఏవో ప్రవీణ గారు, ఏపీఓ రామ్మోహన్ గారు, వెటర్నెట్ డాక్టర్ విశాల్ గారు మరియు అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.
ఇట్లు ఎంపీడీవో చౌటకూర్.

# వసంత పంచమి మహోత్సవ వేడుకలకు ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం.

**- చిన్నారుల అక్షరాభ్యాసానికి కొంగు బంగారం గా మారిన "శ్రీ మహా సరస్వతి" అమ్మవారు.**
**- భక్తుల పాలిట మరో బాసర క్షేత్రంలా మారిన శ్రీ మహాశక్తి ఆలయం.**
**- వసంత పంచమి పూజ వేడుకల్లో పాల్గొననున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**




కరీంనగర్ లోని మహిమాన్విత దివ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం శుక్రవారం రోజున జరిగే వసంత పంచమి వేడుకల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామివారి దివ్య ఆశీస్సులతో వసంత పంచమి మహోత్సవ పూజా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాటు చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, రకరకాలపూల అలంకరణతో ఆకర్షనీయంగా తీర్చిదిద్దారు. వసంత పంచమి సందర్భంగా శ్రీ మహాశక్తి దేవాలయంలో ఉదయం 4 గం.లకు శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు అభిషేకం, ఉదయం 7:30 నిమి.లకు శ్రీ మహాసరస్వతి దేవి పూజ, అభిషేకం (ఉత్సవ మూర్తికి), కుంకుమార్చన, విద్యార్థులచే సామూహిక పుస్తక పూజలు జరుగనున్నాయి. జ్ఞానాన్ని ప్రసాదించే వేద మాత, తన చల్లని చూపులతో ఆశీర్వదించే శక్తి స్వరూపిణి, అక్షరానికి ఆదిదేవత, ప్రణవ స్వరూపిణి శ్రీ మహాశక్తి శ్రీ మహా సరస్వతి అమ్మవారు. చిన్నారుల అక్షరాభ్యాసానికి కొంగు బంగారంగా ఇక్కడి "శ్రీ మహా సరస్వతి" అమ్మవారు నిలిచారు. ప్రతి ఏటా వసంత పంచమి రోజున వేలాదిగా తరలివచ్చే భక్తులతో రాకతో మరో బాసర క్షేత్రంలా శ్రీ మహాశక్తి ఆలయం మారింది. ముఖ్యంగా వసంత పంచమి రోజున దేవాలయంలోని శ్రీ మహాశక్తి అమ్మవారిని పూజించిన వారికి, జ్ఞానం, వివేకం, వాక్చాతుర్యం, సృజనాత్మక శక్తి ,మేదో సామర్థ్యం పెరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.. అందుకే ఇక్కడి చిన్నారుల అక్షరాభ్యాసానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రతి ఏటా వసంత పంచమి సందర్భంగా ఎంతోమంది చిన్నారుల అక్షరాభ్యాసానికి రాష్ట్రం నలుమూల నుండి ఇక్కడి శ్రీ మహాశక్తి దేవాలయానికి భక్తులు తరలివస్తున్నారు. శుక్రవారం రోజున జరిగే వసంత పంచమి మహోత్సవ వేడుకల, పూజా కార్యక్రమాల్లో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ దంపతులు పాల్గొననున్నారు.సమస్త హిందూ బంధువులందరూ వసంత పంచమి పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని దేవాలయ నిర్వాహకులు కోరారు.

## మహనీయుల విగ్రహాలు ఆవిష్కరణ




మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాదు వారి ఆర్థిక సహాయం తో ఎన్టీఆర్ జిల్లా నందిగామ లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ అయ్యదేవర కాళేశ్వరరావు మాడపాటి హనుమంతరావు విగ్రహాలను అవిష్కరించిన మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు పీసీసీ నాయకులు తులసీరెడ్డి బళ్ళారి రాఘవ కళా సమితి అధ్యక్షుడు బొబ్బెళ్ళపాటి గోపాల కృష్ణ సాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం లో ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ తొలి స్పీకర్ స్వర్గీయ అయ్యదేవర కాళేశ్వరరావు విగ్రహాన్ని మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు అవిష్కరించగా అనంతరం స్వాతంత్ర సమరయోధులు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ తొలి శాసనమండలి చైర్మన్ మాడపాటి హనుమంతరావు విగ్రహాన్ని మాజీ ఎంపీ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవిష్కరించారు ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాజీ ఏమ్మెల్యే శ్రీ బొద్దులూరి రామారావు కే.యల్.రావు కుమారుడు విజయ రావు సీనియర్ కాంగ్రెస్ నేత రేపాల మోహన్ రావు నరహరశెట్టి నరసింహారావు పాలేటి సతీష్ గోపు నరేంద్ర నందిగామ ఆర్యవైశ్య సంఘం నాయకులు పారేపల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు

## ఆరోగ్య కేంద్రాలు తనిఖీ చేసిన డీఎంహెచ్ ఓ డా. తుకారాం రాథోడ్



లక్ష్మీదేవి పల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శేఖరం బంజర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రమదానం సమిష్టి భోజనం కార్యక్రమాన్ని పరిశీలించారు.కేంద్ర పరిసరాల పరిశుభ్రత,వాడకం లేని పరికరాలను తొలగించిన విధానంపై సంతృప్తిని వ్యక్తం చేశారు.అదేవిధంగా శేఖరం బంజర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్?లో నూతనంగా ఏర్పాటు చేసిన మీటింగ్ హాల్ నిర్వహణపై సమీక్ష నిర్వహించి, అక్కడ జరుగుతున్న పనితీరును నిశితంగా పరిశీలించారు. అనంతరం జిల్లా కార్యాలయంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి, జిల్లాలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.ఈ కార్యక్రమంలో డెమో నాగలక్ష్మి, డిపి ఎం ఓ మోహన్, డిపి యు సలితతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149


సముద్రపు చేపలు
Sea Fish
Sea food.. Salmon, Tuna, Cod, Tilapia, Snapper, Shrimp, Lobster, Crab available
linga frozen food, bhatti savargav road, adilabad.
cell: 93813 43925

THE HONEST TELUGU DAILY


పచ్చి రొయ్యలు
సంప్రదించాల్సిన నెంబర్ 93813 43925
Sea food.. Salmon, Tuna, Cod, Tilapia, Snapper, Shrimp, Lobster, Crab available
linga frozen food, bhatti savargav road, adilabad.





# అటవీ సమస్యలు పరిష్కరిస్తాం - మంత్రి కొండా సురేఖ

ఈకాలం, ఆదిలాబాద్ : గిరిజనులు ఎదుర్కొంటున్న గిరిజనుల సమస్యలు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పనిసరిగా పరిష్కరిస్తామని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భరోసా ఇచ్చారు. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లో నాగోబా జాతర సందర్భంగా గురువారం దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖతో పాటు స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ రాజర్షి షా తదితరులు పాల్గొన్నారు. ముందుగా నాగోబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో మేడారం తర్వాత రెండో అతి పెద్ద గిరిజన జాతర నాగోబా నేనని తెలిపారు. గత ప్రభుత్వం కేస్లాపూర్ ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని .. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడకు వచ్చారని గుర్తు చేశారు. ఈ పరిణామం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. అటవీ సమాచారం సెంట్రల్ పోర్టల్ లో నమోదై ఉంటుందని ఈ ప్రాంతంలో చిన్న పాటి పని చేపట్టినా కేంద్ర ప్రభుత్వానికి తెలిసిపోతుందని వివరించారు. దీంతో అడ్డుకోకపోతే అధికారులకు ఇబ్బందికరంగ మారుతుందని చెప్పారు. రాష్ట్ర పరిధిలో గిరిజనులు ఎదుర్కొంటున్న అటవీ సమస్యలు ఏమైనా ఉంటే తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. అటవీ పరిధిలో గిరిజనులు నిర్మిస్తున్న ఇండ్లు త్వరగా పరిష్కరించేందుకు తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో విద్యాపరమైన సంస్థలు నెలకొల్పడం కోసం అవసరమైన నివేదిక అందించాలని సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. మేడారం లో ఇది వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా తమ ప్రభుత్వం రూ. 250కోట్లతో శాశ్వత నిర్మాణా లు చేపట్టిందని గుర్తు చేశారు. నాగోబా జాతరకు రూ. 22 కోట్లు త్వరితగతిన విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో కొన్ని సమస్యలు పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లకుండా గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. నాగోబా ఆలయ పూజరులు ఏడుగురికి దూపదీప నైవేద్యం కింద దేవాదాయ శాఖ వేతనాలు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం తొమ్మిది మందికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్,ఎస్పీ అఖిల్ మహాజన్, ఎస్పీలు కాజల్ సింగ్, మౌనిక, డిఎఫ్ఓ ప్రశాంత్ భాజీరావు పాటిల్, జిల్లా సర్ మేడి మెస్రం దుర్గు తదితరులు పాల్గొన్నారు.

## లోకల్ న్యూస్

### గోమాత సేవా సమితి వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ

ఈకాలం, ఆదిలాబాద్: గోమాత సేవా సమితి వెల్ఫేర్ సొసైటీ అదిలాబాద్ కొత్త కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా భారె శ్రీధర్, ప్రెసిడెంట్గా బి.గణేష్ వర్మ, జనరల్ సెక్రెటరీగా ఆర్. రాహుల్, వైస్ ప్రెసిడెంట్ గా డి. హనుమాండ్లు, ట్రెజరర్ కే. కృష్ణ,జాయింట్ సెక్రెటరీగా హర్షవర్ధన్,సోషల్ మీడియా ఇంచార్జీగా కోటా వార్ సాయి కృష్ణ, పలువురు సభ్యులుగా ఎన్నికైనట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు.



# ఆదిలాబాద్ మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరాలి

## మాజీ మంత్రి జోగు రామన్న






ఈకాలం, ఆదిలాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ... రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరెలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కార్యాచరణ తదితర అంశాలపై శ్రేణులతో సుదీర్ఘంగా చర్చించారు. అత్యధిక సంఖ్యలో కౌన్సిలర్ సీట్లు గెలిచేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా మాజీమంత్రి జోగురామన్న సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ ఘన విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా క్షేత్రంలో ఉంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నాయకులు అలాల్ అజయ్, సాజిదోద్దీన్, గండ్రత్ రమేష్, కుంర రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న మున్సిపల్ ఎన్నికల ప్రణాళిక సిద్ధం చేశారు.



# మంత్రి కొండా సురేఖ తోకలిసి.. నాగోబా దర్శనం!

ఈకాలం ఆదిలాబాద్ : నాగోబా జాతరలో భాగంగా నేడు ప్రభుత్వం తరుపున నిర్వహించే ప్రజా దర్బార్ కు విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ అటవీ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ తో కలిసి రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గురించి శ్రీకాంత్ రెడ్డి నాగోబా దర్శనం చేసుకున్నారు. నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజోల్, ఐటిడిఏ పీఓ, ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి, టీపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మంత్రి వెంట ఉన్నారు. సాంప్రదాయ డోలు వాయిద్యాల నడుమ స్వాగతం పలికిన మేస్త్రం వంశీయులు మంత్రికి నాగోబా తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, ఆసిఫుల్ల ఖాన్, మల్యాల కరుణాకర్, అట్ల గోవర్ధన్ రెడ్డి, అలీమ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

**Journalist news**

30 ఏళ్లుగా గుడిహత్నూర్ ఈనాడు రిపోర్టర్ గా పనిచేస్తున్న మురళి లివర్ సమస్యతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నాడు

# గుడిహత్నూర్ ఈనాడు రిపోర్టర్ కు.. ఎమ్మెల్యే పరామర్శ!



మురళిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఈనాడు రిపోర్టర్ మురళికి లివర్ వ్యాధి తగ్గుముఖం పట్టకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు**

ఈకాలం ఆదిలాబాద్ : లివర్ సమస్యతో నిర్మల్ ఎన్వీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుడి మండల ఈనాడు రిపోర్టర్ మురళి ని బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల్ మాజీ ఎఎంసి చైర్మన్ ముత్యం రెడ్డి ని కూడా ఎమ్మెల్యే పలకరించారు. ఆయన వెంట బోథ్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు.



# సనాతన హిందూ ఉత్సవ సంతి ఆధ్వర్యంలో.. ఎస్పీకి బర్త్ డే విషెస్

ఈకాలం, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బర్త్ డే ను పురస్కరించుకొని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. వేద పండితులు సంతోష్ శర్మ మంత్రోచ్చారణల నడుమ ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, కోశాధికారి రేణుకుంట రవీందర్, సభ్యులు కందుల రవీందర్, ఉరాడే సుభాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు.. బోరంచు సన్మానం!

ఈకాలం ఆదిలాబాద్ : నాగోబా జాతరకు హాజరైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఉట్నూర్ లోని కేబి కంప్లెక్స్ లో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సన్మానించారు. నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరితోపాటు టీపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, ఆసిఫుల్ల ఖాన్, మల్యాల కరుణాకర్, అట్ల గోవర్ధన్ రెడ్డి, అలీమ్ ఖాన్ తదితరులున్నారు.

## రిక్షా కాలనీలో అభివృద్ధి పనులు

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం రిక్షా కాలనీ లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. - ఈకాలం ఆదిలాబాద్



# హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో.. ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు!

**ఈకాలం ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బర్తడే ను పురస్కరించుకొని ఆదిలాబాద్ హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమితి అధ్యక్షులు బొంపెల్లి హన్మండ్లు, శ్రీకర్ బోలేన్వార్, సిద్ధూ బోలేన్వార్, ఆరే రామకృష్ణ, ఆరే ప్రశాంత్ ఎస్పీని శాలువాతో సత్కరించారు.







# పేరుకుపోయిన సమస్యల పరిష్కారం - ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఈకాలం, ఆదిలాబాద్ : ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కానీ కొందరు రాజకీయ నేతలు ఈ పనులను అడ్డుకోవడం జరుగుతోందని ఆరోపించారు. ఆదిలాబాద్ పట్టణ ప్రజలు, కచ్ కంటి గ్రామస్థులు గత కొన్నేళ్లుగా స్లాటర్ హౌస్ దుర్వాసన తో ఇబ్బంది పడుతున్న నేపద్యంలో ఇటీవల స్లాటర్ హౌస్ తొలగింపుతో గురువారం ఇందిరమ్మ కాలనీ లో ఎమ్మెల్యే కు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను ప్రజలు శాలువాతో సత్కరించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆదిలాబాద్ ప్రజలు ఎదురు చూస్తున్న స్లాటర్ హౌస్ తొలగింపుతో ప్రజలు దుర్వాసనతో పడుతున్న ఇబ్బందులు తొలిగిపోయయాన్నారు.

ఈ పశు వదశాలతో ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కుక్కల బెడద పెరిగిందన్నారు. దుర్వాసన తట్టుకోలేక ఇబ్బందులు పడిన ప్రజలకు గతంలో ఇచ్చిన హామీ మేరకు తొలగించడం జరిగిందన్నారు. కానీ పశు వదశాల తొలగిస్తే పాయల్ శంకర్ కు, బీజేపీ కి మంచి పేరువస్తోందని దిన్ని అడ్డుకోవడానికి కుట్రలు చేశారని ఆరోపించారు. బీజేపీ నీ ప్రజలు ఆదరించాలని దీంతో పట్టణంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, ధోని జ్యోతి, లాలా మున్నా, దయాకర్, చారి, రాజేందర్, సాయి, దత్తు, కాలనీవాసులు ఉన్నారు.

# కేస్లాపూర్ లో వైభవంగా దర్బార్.. తరలొచ్చిన గిరిజనం



ఈకాలం, ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా గురువారం నిర్వహించిన గిరిజన దర్బార్ వైభవంగా సాగింది. జిల్లా నలిమూలాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ఆదివాసీ గిరిజనులతో పాటు అనేకమంది తరలివచ్చారు. నాగోబా జాతరతో పాటు దర్బార్ ప్రాంతం జన సంద్రంగా మారింది. ఈ వేడుకకు రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్శి షా, ఐటీడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఏఎస్పీలు కాజల్ సింగ్, మౌనిక, మెస్రం వంశీయులు, తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు ఏకరువు..

గిరిజన దర్బార్ లో వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడారు. ముఖ్యంగా అనేక ఏళ్లుగా జీవనం సాగిస్తున్న తమ ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని.. కానీ అటవీ శాఖ అధికారులు మాత్రం ఇది అటవీ ప్రాంతమని ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు లేవని అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సైతం జన్ మన్ యోజన కింద ఇండ్లతో పాటు వివిధ అభివృద్ధి పనులు కూడా మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఆదివాసులు నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణాలను అడ్డుకోవద్దని.. ప్రభుత్వం వెంటనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సైతం అటవీ సమస్యల కారణంగా గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి సైతం ఇది వరకే తీసుకెళ్లామని చెప్పారు. కొత్తగా అటవీ భూముల జోలికి గిరిజనులు వెళ్లరని.. పాత వాటిని మాత్రం వదులుకొనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. స్పందించిన మంత్రి కొండా సురేఖ రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కేంద్రం పరిధిలో ఉన్న వాటి గురించి ప్రభుత్వంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఆదివాసులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలు ఆగిపోతున్నాయని.. పలు చోట్ల రోడ్ల నిర్మానాలు సైతం నిలిచిపోయాయని వివరించారు. ప్రభుత్వం పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది దర్బార్ సందర్భంగా 540 వినతులు రాగ వాటన్నింటిని పరిష్కరించామని తెలిపారు. పలువురు ఆదివాసులు జాతీయ స్థాయిలో అవార్డులు స్వీకరించి జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

గిరిజన దర్బార్ సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ గిరిజన సాంప్రదాయం ఉట్టి పడేలా విద్యార్థులు, భద్రాచలం, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని అలరించాయి.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkajgiri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149